ప్రజాశక్తి

సోమవారం 8 సెప్టెంబర్ 2025





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

రక్తపరీక్షల దోపిడీ..!



◆ ఒక్కో పరీక్షకు రూ.500 నుంచి రూ.2వేలు వసూలు

◆ పుట్ట గొడుగుల్లా ప్రయివేటు ల్యాబ్‌లు ◆ అధికారుల తనిఖీలు నామమాత్రమే

జిల్లాలో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా కన్పిస్తోంది. అన్ని అసుపత్రుల్లో జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చే వారు ఎక్కువగా కన్పిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రోగులకు వైద్యులు రక్తపరీక్షలను చేయించుకోవాలని సూచిస్తున్నారు. ఈ రక్తపరీక్షల తంతుకాస్తా ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులకు కాసులు కురిపిస్తోంది. రోగికి అవసరం ఉన్నా, లేకున్నా రక్తపరీక్షలు రాసి వారితో వేలాది రూపాయలు దోచుకుంటున్నారు.



పట్టణంలో ఓ ప్రయివేటు ల్యాబ్‌లో తనఖీ చేస్తున్న వైద్యాధికారి డా॥పద్మజ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా దాదాపు 250కు పైగా ప్రైవేటు ఆసుపత్రులు ఉండగా అందులో 100కి పైచీలుకు ఆసుపత్రులు అనంతపురం జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఇకా హిందూపురంలో దాదాపు 40దాక ఉన్నాయి. చిన్నపాటి సమస్యతో వెళ్లినా స్కానింగ్‌లు, రక్త పరీక్షలు అంటూ హడావుడి చేసి స్కానింగ్ సెంటర్ల పర్సంటేజీలకు కక్కుర్తి పడుతున్నారు. కనీసం రోగి నాడి పట్టి చూడకుండా రిపోర్టుల ఆధారంగానే కుప్పలు తెప్పలుగా మందులు రాసేస్తున్నారు. ఆస్పత్రికి వెళ్లిన రోగిని వివిధ రకాల రక్తపరీక్షలు చేయించుకురావాలంటూ వైద్యులు సూచిస్తారు. ఈ చీటి పట్టుకుని ట్యాబ్‌కు వెళ్తే అక్కడ వేలాది రూపాయలు లాక్కొంటున్నారు. జిల్లాలో చాలా చోట్ల అనధికారిక రక్త పరీక్షా కేంద్రాలు నడుస్తున్నా సంబంధిత అదికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. కనీస అవగాహన లేని సిబ్బంది రక్తపరీక్ష కేంద్రాల్లో పని చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రయివేటు ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లలో టెక్నీషియన్లకు సరైన అర్హత లేకపోయినా వైద్యులు వారి వద్దనే రక్తపరీక్షలు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణ రక్త పరీక్షలు చేయాలంటే డిఎంఎల్‌టి, డిఎస్‌బిఎంఎల్‌టి, ఎంఎస్‌డిఎల్‌టి పూర్తి చేయాలి. చాలా మందికినీ అర్హతలు లేకపోయినా ప్రయివేటు కేంద్రాల్లో పని చేస్తున్నారు. అనుభవం, అవగాహన లేని వారు రక్తపరీక్షలు చేసి తప్పుడు రిపోర్టులు ఇచ్చిన సందర్భంలో రోగులు మరింత భయపడి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ప్రతి కేంద్రంలో ఆయా పరీక్షలకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఇలాంటి సూచిక బోర్డులు ఎక్కడా కనిపించవు.

పీల్చి పిప్పి చేస్తున్న ల్యాబ్ నిర్వహకులు

చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ప్రయివేటు ఆరోగ్య కేంద్రానికి వెళ్తే రోగుల బలహీనతను సొమ్ము చేసుకుంటారు. ధనార్జనే ధ్యేయంగా ఆరోగ్య సమస్య లేకపోయినా లేనిపోని అపోహలు తలెత్తెలా అన్ని రకాల రక్తపరీక్షలు చేయించి రోగుల జేబులు ఖాళీ చేయిస్తున్నారు. అందులో వైద్యులకు భారీగా పర్సంటేజీలు ఇస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒక్కో రక్త పరీక్షకు రూ.500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తున్నారు. ఒక వైద్యుడి వద్ద చేయించిన రక్త పరీక్షలను మరో డాక్టర్ ఒప్పుకోరు మళ్లీ తాను చెప్పిన వారి వద్దనే చేయించుకోవాలంటూ చీటిరాసి పంపుతున్నారు. దీంతో రోగి ఆర్థికంగా చితికి పోతున్నాడు. జిల్లాలో సుమారు 600కు పైగా ఈ రక్త పరీక్షా కేంద్రాలున్నాయి. ఇందులో ఎటువంటి అనుమతులూ లేని రక్తపరీక్షా కేంద్రాలను తనిఖీలు చేయాల్సిన జిల్లా వైద్యాధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వ్యాపారుల సిండికేట్

వ్యాధి నిర్ధారణ కోసం వెళ్తే గతంలో ఒక్కో డయాగ్నోస్టిక్ కేంద్రంలో అక్కడ ఉన్న వైద్య పరికరాల నైపుణ్యతను బట్టి ధరలు ఉండేవి. ఈ నేపథ్యంలో తక్కువ ఫీజులు తీసుకునే డయాగ్నోస్టిక్ కేంద్రాలకు రోగులు ఎక్కువగా వెళ్లేవారు. గత మూడు నెలలుగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే రకమైన ఫీజులు తీసుకుంటున్నారు. ఫీజుల వసూలుకు ఒక నిబద్ధత, నియంత్రణ లేకుండా పోయింది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఈ సెంటర్లను నియంత్రించే అధికారం తమకు లేదని వారు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. చట్టంలో లొసుగులను ఆసరా చేసుకుని అడ్డగోలుగా ప్రయివేటు కేంద్రాలు రోగుల నుంచి దోచేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

రోగులతో వైద్యుల చెలగాటం.!

ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్ల దోపిడీకి తోడు వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్నారు. తక్కువ ధర ఉన్న సెంటర్లకు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే ఆ ఫలితాలను రెఫర్ చేసిన వైద్యులు అంగీకరించడం లేదు. రక్త, మూత్ర పరీక్షలు సదరు ప్రయివేటు అసుపత్రికి అనుబంధంగానే ఎక్కువగా నిర్వహిస్తుంటారు. డాక్టర్లకు డయాగ్నోస్టిక్ సెంటర్లకు విడదీయరాని కమీషన్ల బంధం ఉందనేది జగమెరిగిన సత్యం. ఫలానా డయాగ్నోస్టిక్ సెంటర్‌కే వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కొందరు వైద్యులు రోగులకు ఆర్డర్లు వేస్తుంటారు. వారు చెప్పినట్లు వినక ఇతర సెంటర్లకు వెళ్తే వ్యాధి నిర్ధారణ సరిగా లేదని వంకలు పెట్టడం పరిపాటిగా మారింది. వ్యాధి నిర్ధారణ ఎలా ఉన్నా ఫరావా లేదు.. తమకు కమీషన్లు వస్తే చాలనుకునే వైద్యులు కోకొల్లలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రక్తపరీక్షల కేంద్రాలపై పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించి, ఒక నిర్దిష్టమైన ఫీజులు నిర్ధారించేందుకు జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయిలో ఒక కమిటీ వేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

అడ్డగోలుగా దోపిడీ



ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్లలో అడ్డగోలుగా దోచు కుంటున్నారు. గతంలో కొన్ని సెంటర్లలో ఫీజులు తక్కువ ఉండేవి. ఆయా సెంటర్లలో ఉండే పరికాలను బట్టి ఫీజులు తీసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చిన్న, పెద్ద డయాగ్నోస్టిక్ సెంటర్ ఏదైనా ఒకే రకమైన ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇది పేదల మీద విపరీతమైన ప్రభావం చూపుతోంది. వ్యాధి నిర్ధారణ కోసం అష్టకష్టాలు పడుతున్నారు. ఫీజులు నియంత్రించకుంటే పేదలు తమ రోగాలకే ఉన్నదంతా సమర్పించుకోవల్సి వస్తుంది. అధికారులు స్పందించి డయాగ్నోస్టిక్ సెంటర్ల చర్యలను నియంత్రించాల్సిన అవసరం ఉంది.

రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రా..

జగన్‌కు మంత్రి సవిత సవాల్

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రజా సమస్యలపై జగన్మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సవాల్ విసిరారు. మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో మంత్రితో పాటు పెనుకొండ నియోజకవర్గం పరిశీలకులు ఆంజనేయులు, నర్సింగరావు, రాష్ట్ర మార్కెట్ ఫెడ్ చైర్మన్ బంగార్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన తండ్రి శవం ప్రక్కన కూర్చొని సంతకాలు పెట్టించుకున్న ఘనత రంగులరెడ్డి జగన్‌ది అని ఎద్దేవా చేశారు. జగన్ కు నిజంగా ప్రజల గురించి మాట్లాడాలనిపిస్తే ఈ నెల 18 నుండి జరిగే అసెంబ్లీ సమావేశాలకు హజరు కావాలని సవాల్ విసిరారు. ఈ నెల 10న అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభకు 164 మంది ఎమ్మెల్యేలు వస్తున్నారని, ఈ సభ విజయవంతం చేసి వైసిపికి బుద్ధి చెప్పి, రాష్ట్ర ప్రజలకు కూటమి ప్రభుత్వం పై మరింత నమ్మకం కలిగేలి చేద్దామని కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సగర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, కన్వీనర్ వెంకటేష్, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, తొగట వీర చత్రి సంఘ అధ్యక్షులు సిసి హరిదాస్, హిందూపూర్ పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, మాగే చెరువు సర్పంచి నరసింహులు, మేకలపల్లి ఆదినారాయణ, జనసేన నాయకులు గంగాధర్, నాగరాజు, జేబీవుల్లా, కూటమి నాయకులు, మంజు, సోమశేఖర్, తదితర తెలుగుదేశం కూటమి నాయకులు పాల్గొన్నారు.

జీ తెలుగు సరిగమ లిటిల్ ఛాంప్స్ పోటీలో ధర్మవరం విద్యార్థిని

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

జీ తెలుగు సరిగమప లిటిల్ చాంప్స్ లో శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన విద్యార్థిని, గాయని లక్ష్మీ చౌదరి పాల్గొని తన ప్రతిభను చాటింది. పట్టణంలోని కోర్టు రోడ్డులో గల శ్రీ లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీదారులు గోవింద్ చౌదరి, లక్ష్మీ చౌదరి మనవరాలు, అనంత సయన, తల్లి కీర్తి చౌదరిల కుమార్తె లక్ష్మీ చౌదరి చిన్నతనము నుంచి చదువుతోపాటు గత ఎనిమిది సంవత్సరాలుగా కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, లలిత సంగీతంలో ఎంతో సాధన చేసి, పలుచోట్ల గుర్తింపు పొందింది. లక్ష్మీ చౌదరి తల్లిదండ్రులు కూడా ఈమె ప్రతిభను గుర్తించి, చదువుతో పాటు సంగీతం అభ్యసించడాన్ని కూడా ప్రోత్సహించారు. ఈ నేపథ్యంలో జీ తెలుగు సరిగమప లిటిల్ చాంప్స్ లో వెళ్లాలన్న అకుంఠిత దీక్షతో అనంతపురంలో ఆడిషన్ మొదటి రౌండ్‌కు ఎంపిక కావటం హైదరాబాదులో కూడా సెలెక్ట్ అయింది. మెగా అడిషన్‌లో ఈనెల 6వ తేదీ శనివారం ప్రసారం అయిన జీ తెలుగు టీవీలో జీ తెలుగు సరిగమప లిటిల్ చాంప్స్ లో చిన్నారి లక్ష్మీ చౌదరి తన పాటతో అందరిని అలరించింది. ఆట అనే సినిమాలో ఏల ఏల అనే పాటను ఎంపిక చేసుకొని జి తెలుగు లో తన ప్రతిభను కనబరిచింది. తాను పాడిన ఈ పాటకు ముగ్ధులైన జడ్జీలు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.



గేయం ఆలపిస్తున్న లక్ష్మి చౌదరి

వైసిపి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి : శ్రీరామ్



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ ద్వారానే సమాధానం చెబుదామని ధర్మవరం నియోజకవర్గ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. ఈనెల 10న అనంతపురంలో జరగబోయే విజయోత్సవ సభకు సంబంధించి... ధర్మవరం టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, కూటమి నాయకులు సంధి రెడ్డి శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డితో పాటు ధర్మవరం నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కు వెళ్లిందని.. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు ఓవైపు సంక్షేమాన్ని మరోవైపు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ఎవరు ఊహించని విధంగా 14 నెలల్లోనే సూపర్ సిక్స్ హామీలు అమలు చేశారన్నారు. మంచిని కూడా వైసిపి నాయకులు చెడుగా ప్రచారం చేస్తున్నారన్నారు. దీనిని మనం సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సూపర్ హిట్ సభను విజయవంతం చేయడం ద్వారా ఒక మెసేజ్ ఇచ్చినట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం పార్టీ నాయకులు మూడు రోజులు పాటు కష్టపడాలని సూచించారు. మంత్రి గొట్టిపాటి రవి మాట్లాడుతూ పరిటాల రవితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ సందర్భంగా వెంకటాపురం వెళ్లడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైసీపీ నాయకులకు అవకాశం ఇవ్వకుండా వారు చేసే దుష్ప్రచారాలకు తెరదించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఇందు కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు ముందుకు రావాలన్నారు. అనంతపురం జిల్లాలో 14 స్థానాలకు 14 గెలిచారని అందుకే ఈ జిల్లా నుంచి రాష్ట్ర ప్రజలకు సందేశం ఇవ్వడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

ఉపాధ్యాయుడు విద్యార్థులతో మమేకం కావాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆత్మీయ ట్రస్ట్, యూటీఎఫ్ ధర్మవరం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ ట్రస్ట్ ఛైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినిమా నటుడు నాగినీడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విద్యార్థులతో అనుసంధానం కాకపోతే వారు చెప్పే చదువు అర్థం కాదనిఅన్నారు. తల్లిదండ్రుల్లా, స్నేహితుల్లా ఉన్నట్లు వారితో ఆకర్షణ అయ్యేలా ఉండాలన్నారు. అప్పుడే ఆ విద్యార్థి ఉపాధ్యాయులకు అనుసంధానమై చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరి ఆలోచన విధానం భిన్నంగా ఉంటుందని,అందరి ఆలోచనలను అలవోకగా ఒడిసిపట్టి వారి మనస్థత్వాలకు అనుగుణంగా పాఠాలు బోధించాలన్నారు. విద్యార్థికి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే ఆ ఉపాధ్యాయుడు దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చేలా విద్యార్థులను ఆకర్షణ ఉండే విధంగా చేసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని వివరించారు. ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయుల్లో 68 మందిని ఎంపిక చేసి వారికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించడం సంతోషంగా ఉందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆత్మీయ ట్రస్ట్ ఉత్తమ ప్రభుత్వ ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులు అందించడం గొప్ప విషయమని తెలిపారు. అనంతరం 68మంది ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులను సినీ నటుడు నాగినీడు చేతులమీదుగా మెమెంటో, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ డీవైఈఓ జాన్ రెడ్డప్ప, ధర్మవరం ఎంఇఒలు రాజేశ్వరిదేవి, గోపాల్ నాయక్, చిలమత్తూరు ఎంఇఒ హనుమంతరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్. రమణయ్య, రామప్పచౌదరి, నాయకులు పెనుకొండ నారాయణస్వామి, రామకృష్ణనాయక్, బూతన్న, భాబు, శ్రీనివాసులు, మేరివరకుమారి, మారుతి, ఆంజనేయులు, హరికృష్ణ, రాంప్రసాద్, వెంకటకిషోర్, సకల చంద్రశేఖర్, సురేష్, హెచ్.రామంజినేయులు, సాయిగణేష్, జెవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు, ఎస్ఎఫ్ఐ నాయకులు నామాల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాల ప్రదానంలో వక్తలు



పురస్కారాలు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు, నిర్వాహకులు

రైతులకు అనుకూలంగా మార్కెట్‌యార్డులు

◆ గిట్టుబాటు ధరలకు విక్రయించుకునేలా అవకాశం ◆ జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఎల్.నరసింహమూర్తి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'రైతులు పండించిన తమ ఉత్పత్తులను సమీప మార్కెట్ యార్డులలో దళారుల బెడద లేకుండా విక్రయించుకునేందుకు జిల్లాలో మార్కెట్‌యార్డులు అందుబాటులో ఉన్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు లేక తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతుంటారు. సరైన మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం పంట ఉత్పత్తులను దాచుకునే సదుపాయం లేకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం మార్కెట్ యార్డులను ఏర్పాటు చేసి పలు సదుపాయాలను అదిస్తోంది'. అని జిల్లా శ్రీసత్యసాయి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఎంఎల్.నరసింహ మూర్తి తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు.



ఎంఎల్.నరసింహమూర్తి



ప్రశ్న:- జిల్లాలో ఎన్ని మార్కెట్ యార్డులు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఇందులో శీతల గిడ్డంగులు ఉన్నాయా?

ఎడి: జిల్లాలో 8 మార్కెట్ యార్డులు ఉన్నాయి. ధర్మవరం, గోరంట్ల, హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, తనకల్లులో ఉన్నాయి. ఇందులో శీతల గిడ్డంగులు ప్రభుత్వపరంగా లేవు. ఎవరైనా ప్రయివేటు వ్యక్తులు శీతల గిడ్డంగులు ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి భూమి సదుపాయం కల్పిస్తాం. ఆ గిడ్డంగులలో నిలువచేసే సరుకులకు వారు సుంకం వసూలు చేసుకోవచ్చు. హిందూపురంలో ఆ విధంగా ముందుకు వచ్చి శీతల గిడ్డంగులు కొందరు నిర్మించుకున్నారు.

ప్రశ్న: జిల్లాల్లో మార్కెట్‌యార్డుల నిర్వహణ ఏమిటి.?

ఎడి: జిల్లాలో ధాన్యం నిలువ చేసుకునే గిడ్డంగులు అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ ఉన్నాయి. ఆ గిడ్డంగులలో నామమాత్రపు ఫీజు చెల్లించి ఎన్ని రోజులైనా పంటను నిలువ చేసుకునే అవకాశం ఉంది. పెద్ద మార్కెట్లు కలిగిన పట్టణాల్లో ఉండే మార్కెట్ యార్డుల్లో రోజువారి లేదా వారానికి ఒకసారి రైతులు తమ ఉత్పత్తులను వేలం ద్వారా విక్రయించుకునే అవకాశం ఉంటుంది. వ్యాపారులు వేలం పాటలలో పాల్గొంటారు. దీనివల్ల రైతులు దళారుల బారిన పడకుండా తమ ఉత్పత్తులను విక్రయించుకునే వెసులుబాటు ఉంది.

ప్రశ్న: మార్కెట్‌యార్డులలో ఏఏ సరుకులు విక్రయాలు ఉంటాయి? ఎన్ని గిడ్డంగులు ఉన్నాయి?

ఎడి: ప్రధానంగా వ్యాపార కూడలి అయిన హిందూపురంలో చింతపండు, వట్టి మిరప, సరుకులు క్రయవిక్రయాలు ఉంటాయి. ఇవి గాక రోజువారి వస్తువుల వ్యాపారాలు జరుగుతుంటాయి. గోరంట్ల మార్కెట్ యార్డ్‌లో కదిరి, కొత్తచెరువు యార్డులలో పశువుల వారపు సంతలు జరుగుతాయి. అందులో పశువుల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ధర్మవరంలో మామిడికాయల సీజన్‌లో ఎక్కువగా ఆ కాయల విక్రయాలు జరుగుతుంటాయి. ఈ యార్డుల్లో 30 వరకు గిడ్డంగులు ఉన్నాయి. ఇవి గాక ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కూడా గిడ్డంగులు ఉన్నాయి.

ప్రశ్న: మార్కెట్ యార్డుల వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయి? చెక్ పోస్టుల పని విధానం ఏమిటి?

ఎడి : మార్కెట్ యార్డులలో రైతులు తమ పంటల ఉత్పత్తులను నామమాత్రపు ఫీజులతో నిలువ చేసుకోవచ్చు. దళారుల బెడద లేకుండా స్వేచ్ఛగా తమకు నచ్చిన ధరకు సరుకు విక్రయించుకోవచ్చు. జిల్లాలో 12 చెక్‌పోస్టులు ఉన్నాయి. బత్తలపల్లి, రాళ్లఅనంతపురం, గుమ్మయ్యగారి పల్లి, పాలసముద్రం, కొడికొండ, మేళాపురం, కుటాగుల్ల, మడకశిర, పెనుకొండ, కొత్తచెరువు, మహమ్మదాబాద్ క్రాస్, కొక్కంటి క్రాస్ ప్రాంతాలలో చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ చెక్‌పోస్టులలో ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా చట్ట వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాలకు వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేసే వాహనాలను తనిఖీ నిర్వహించి, అక్రమంగా తరలిస్తుంటే తగిన చర్యలు తీసుకుంటాం. రైతు వారి ఉత్పత్తులకు సంబంధించి సరైన పత్రాలు చూపించి ఎక్కడైనా విక్రయించుకునే సదుపాయం ఉంది. తన ఉత్పత్తులకు సంబంధించి పాస్ పుస్తకం, వన్ బి తదితర పత్రాలను చెక్కు పోస్టులల్లో అధికారులకు చూపించాల్సి ఉంటుంది.

ప్రశ్న:ఏటా మార్కెట్ యార్డుల ద్వారా ఎంత మొత్తం ఆదాయం ఉంటుంది? అన్నింటికి భవన సముదాయాలు ఉన్నాయా.?

ఎడి: జిల్లాలోని 8 మార్కెట్ యార్డుల ద్వారా సుమారు రూ.5కోట్లు ప్రభుత్వానికి పన్నుల రూపంలో వస్తోంది. చెక్‌పోస్టుల్లో తనిఖీల ద్వారా వచ్చిన డబ్బును మరుసటి రోజే చలానా ద్వారా సిబ్బంది చెల్లించాల్సి ఉంటుంది. కొత్తచెరువు, గోరంట్ల యార్డుల్లో అధికారుల కార్యాలయాల భవనాలు చిన్నగా ఉన్నాయి. వాటిని పెద్దగా నిర్మించాల్సి ఉంది. చాలా యార్డుల్లో సిసి రహదారులు, డ్రెయినేజీ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. వీటిపై ప్రభుత్వానికి నివేదికలు ప్రతిపాదించాం.

ప్రశ్న:మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా? రైతులకు మీరు ఇచ్చే సూచనలు, సలహాలు ఏమిటి?

ఎడి: మార్కెట్ యార్డులలో దాదాపు 50 శాతం సిబ్బంది అవసరం అవుతుంది. ఉన్న వారితోనే కొనసాగిస్తున్నాం. ప్రభుత్వానికి తగిన ప్రతిపాదనలు ప్రతిపాదించాం. రైతులు తమ ఉత్పత్తులను దళారుల బారిన పడకుండా మార్కెట్ యార్డుల ద్వారా గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవచ్చు.

9న విద్యార్థులకు 5కె రెడ్‌రన్ పోటీలు

ప్రజాశక్తి-హిందూపురం

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టరు ఆదేశాల మేరకు యువతలో హెచ్.ఐ.వి. పట్ల అవగాహన కొరకు డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 5 కిలోమీటర్ల మారథాన్ రెడ్ రన్ కార్యక్రమాన్ని హిందూపురం పట్టణంలో ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రసి, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునీల్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతు ఈ పోటీల్లో పాల్గొనే వారు 17-25 సంవత్సరాల మధ్య వయసు ఉన్న విద్యార్థులు అయి ఉండాలన్నారు. సత్యసాయి జిల్లాలో ఏదైనా కాలేజీలో డిగ్రీ చదువుతూ ఉండాలన్నారు. అయితే గత సంవత్సరం నిర్వహించిన రెడ్ రిబ్బన్ మారథాన్ లో పాల్గొని గెలుపొందిన వారు అనర్హులు అన్నారు. ఆసక్తి కల విద్యార్థులు 9వ తేదిన ఉదయం 5:30గంటలకు హిందూపురం మున్సిపల్ ఆఫీస్ వద్దకు చేరుకోవాలన్నారు. 5:30 నుండి 6:30 వరకు రిజిస్ట్రేషన్ ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం మారథాన్ పరుగు పందెం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ 5 కిలోమీటర్ల పరుగు పందెం మున్సిపల్ ఆఫీసు వద్ద ప్రారంభమై, రిలయన్స్ పెట్రోల్ బంకు, గురునాథ్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కోట సర్కిల్, నంది సర్కిల్, రహమత్ పూర్ సర్కిల్ మీదుగా మున్సిపల్ ఆఫీసు వద్ద ముగుస్తుందన్నారు. ఈ మారథాన్ పురుషుల, మహిళలు, ట్రాన్స్జెండర్ల విభాగాల్లో జరుగుతుంది. ప్రతి విభాగములో మొదటి, రెండవ బహుమతులు ఉంటాయని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నగదు బహుమతి విజేతలు రాష్ట్ర స్థాయి మారథాన్ పోటీలలో పాల్గొని వచ్చిన అనంతరం వారి అకౌంట్లలో జమ చేయటం జరుగుతుందని తెలిపారు. అసక్తి గల వారు పోటీల్లో పాల్గొనాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరువెస్ట్ లయన్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (నేత్ర జ్యోతి హాస్పిటల్) డాక్టర్ భరత్, యువర్స్ ఫౌండేషన్ జిల్లా అందత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో 90మంది రోగులను పరీక్షించి 48మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. సీ.కే .శ్రీరాములుజ్ఞాపకార్థం వారి కుమారులు సీ.కే రామాంజనేయులు సికె. శివశంకర్ కుటుంబ సభ్యులు ఈ శిబిరానికి దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలా. నాగేంద్ర, సుంకు సుకుమార్, సెక్రటరీ జయరాం, జాయింట్ సెక్రెటరీ గర్రె.రమేష్ బాబు, పిఆర్ఒ రాధాకృష్ణ,క్యాంపు చైర్మన్ ఖలీల్ రెహమాన్ చాంద్ బాషా, సత్రశాల మల్లికార్జున, వైకె. శ్రీనివాసులు, కోటేశ్వరరావు, షేక్ సికిందర్, నామాల శ్రీనివాసులు, కేతా. లోకేష్, ఆర్వి. నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రజిని ట్రస్టు రక్త బంధం ట్రస్ట్ వారి సౌజన్యంతో ఏపీ ఎస్ ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు బండి శివ ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో పద్మావతి డిగ్రీ కాలేజీలో సోమవారం నిర్వహించే మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని విద్యార్థి సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు బండి శివ మాట్లాడుతూ రక్తదాతల ను ఘనంగా మెమెంటో లు ఇచ్చి సన్మానించడం జరుగుతుందని, అలాగే భవిష్యత్తులో రక్తదాతకు భరోసాగా ఎక్కడ ఏం అవసరం ఉన్నా కూడా రజనీ ట్రస్టు రక్త బంధం ట్రస్టు ఆధ్వర్యంలో రక్త అందించడం జరుగుతుందని తెలిపారు. అదేవిదంగా రక్త దాత కు లక్ష రూపాయలు ఇన్సూరెన్స్ కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు వెంకటేష్, హరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని పాండురంగ నగర్ లోని వివేకానంద యోగ ఇన్స్టిట్యూట్‌లో యోగ సాధకులు తమకు యోగ విద్యను నేర్పిన గురువులను ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద యోగ ఇన్స్టిట్యూట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, సెక్రటరీ కరే రమేష్ తో పాటు యోగా గురువులు, శిష్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి తలుపుల

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యులు అల్తాఫ్ సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గురుకుల విద్యాలయంలోని విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వస్తున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విష జ్వరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలు , ఆశా కార్యకర్తలు కేజీబీవీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

ప్రజాశక్తి - అగళి

మండలంలోని ఆగళి, ఇరిగేపల్లి రైతు సేవ కేంద్రంలో రైతులకు యూరియాను ఆదివారం పంపిణీ చేశారు. ఒక్కో కేంద్రానికి 280 బస్తాలు రావటంతో ఈ రెండు కేంద్రాల నుంచి ఒక రైతు ఒక బస్తా ప్రకారం యూరియా పంపిణీ చేశారు. జడ్పిటిసి ఉమేష్, తహశీల్దార్ సుబ్బారావు, టిడిపి కన్వీనర్ తిప్ప స్వామి, సింగల్ విండో అధ్యక్షులు కుమార్ స్వామి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండలంలోని తుమ్మలకుంట్లపల్లి పంచాయతీ పరిధిలోని ఎగువ చెర్లోపల్లి, బసప్పగారిపల్లి గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆయా గ్రామాల్లో తాగునీటి పథకం మోటార్లు కాలిపోయి నీటి సమస్య నెలకొన్న విషయం తెలుసుకున్న సర్పంచి శ్రీదేవి గ్రామాల్లో పర్యటించి బోరు మోటార్లు మరమ్మతులు చేయించి గ్రామాల్లో నీటి సరఫరా సౌకర్యం కల్పించారని గ్రామస్తులు తెలిపారు.

అగ్రికల్చర్ స్టేట్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఇటీవల ఏపీ స్టేట్ అగ్రికల్చర్ డైరెక్టర్‌గా నియమితులైన కదిరి పట్టణానికి చెందిన బంగారు కృష్ణమూర్తిని అనంతపురం జిల్లా ఆర్‌విఎస్‌ఎస్ వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకుల సంక్షేమం కోసం, టిడిపి కోసం ఆయన చేసిన సేవలను గుర్తించిన అధిష్టానం అగ్రికల్చర్ రాష్ట్ర డైరెక్టర్ గా నియమించిందన్నారు. ఆయన మరెన్నో పదవులు అధిరోహించాలని వాల్మీకి సంఘం నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఎస్‌ఎస్ నాయకులు రాష్ట్ర ట్రెజరరీ శ్రావణ్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వాల్మీకి మేకల శివ ప్రసాద్, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు ముద్దుల చిన్న నరసింహులు, ధనుంజయ అనంతపురం జిల్లా ఆర్‌విఎస్‌ఎస్ అధ్యక్షులు,యం.నరేష్, అక్కులప్ప బి.ఆంజనికుమార్ తదితరులు పాల్గొన్నారు



బంగారు కృష్ణమూర్తిని సన్మానిస్తున్న నాయకులు

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి : సిఐటియు





అమడగూరు, ముదిగుబ్బలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - అమడగూరు

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి సోమవారం తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆటోకార్మికుల యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ట్రాన్స్ పోర్ట్ కమిటీ సభ్యుడు కుళ్లాయప్ప ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పుట్టపర్తిలో కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమానికి ఆటో డ్రైవర్స్ అందరూ తరలి రావాలని కోరారు. ఈసందర్భంగా నాయకులు వివి. రమణ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ప్రారంభించిన రోజే ఆటోలకు డ్రైవర్లకు తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆటోకార్మికుల కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆటో డ్రైవర్లు ఉపాధిని కోల్పోయి ఆటోలకు ఈఎంఐలు ఫైనాన్స్ కట్టుకోలేక పిల్లలను చదివించుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని అమడగూరు ఆటో యూనియన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు కార్యదర్శి రమేష్, బావయ్య, తదితరులు కోరారు.

ముదిగుబ్బ : ఆటోకార్మికులను ఆదుకోవాలన్న డిమాండ్‌తో సిఐటియు రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ రంగం పిలుపుమేరకు సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ రఫీ కోరారు. అదే విధంగా ఈనెల 18న చలో విజయవాడ కార్యక్రమాన్ని కూడా తలపెట్టామని ఈ కార్యక్రమాన్ని కూడా జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, పకీరప్ప, నౌషాద్, టైలర్ ముత్తు, ముబారక్, రహీం తదితరులు కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మడక వెంకటరమణ మృతి విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మృతుని కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి దండే రవి శంకర్, మాజీ సర్పంచి శ్రీరాములు నాయుడు, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం : మండల పరిధిలోని పాపన్న గారి పల్లికి చెందిన టీడీపీ కార్యకర్త సిద్దా రమేష్ నాయుడు అనారోగ్యంతో తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదివారం స్థానిక నాయకులతో కలిసి బాధితుడి ఇంటికి వెళ్లిపరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చి యాభై వేల రూపాయలు నగదును బాధితునికి అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి శ్రీరాములు నాయుడు, వేణుగోపాల్, జయచంద్రారెడ్డి, వెంకటేష్, వేమన్న తదితరులు పాల్గొన్నారు.

1100 సేవలను వినియోగించుకోండి

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీకోసం కాల్‌సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ టిఎస్. చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తాము సమర్పించిన అర్జీలకు ఇప్పటికీ పరిష్కారం కాకపోతే తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతుందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలపై జిల్లా కేంద్రంలో పాటు డివిజన్, మండల, మున్సిపాలిటీ స్థాయిలలో కూడా ఈ వేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చుకోవచ్చని అన్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - బత్తలపల్లి

స్థానిక శ్రీహరి హర పిరిమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బళ్లారి రాఘవ పురస్కారం అందుకున్న వారికి బత్తలపల్లి మారుతి నాట్యమండలి వారు అభినందన సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ నేటి సమాజంలో టీవీ సీరియల్స్, సినిమాల వల్ల మన నాగరికత, కట్టుబాట్లు దెబ్బతింటున్నాయన్నారు. వేషధారణ, మాట్లాడే పద్ధతి చాలా వరకు అసహ్యంగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోని సినిమాలకు, ప్రస్తుత సినిమాలు మధ్య ఉన్న తేడాలను గుర్తించాలన్నారు. కళాకారులు వల్ల కొంత వరకైనా ప్రజలకు నుంచి చేరుతోందన్నారు. ఆనంతరం నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ జాతీయ ఆవార్డు గ్రహీతలైన తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శేషయ్యగారిపల్లి అంజినప్ప, గౌరవాధ్యర్థులు సామవేదం బాలసుబ్రహ్మణ్యం (విశాఖపట్నం), ట్రస్ట్ డైరెక్టర్ పెద్దరికం సాయి. కార్యదర్శి బొగ్గు రవిలకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఈ ఏడాది జూలై 30వ తేదీన లేపాక్షి పద్యనాటక పోటీల్లో పాల్గొన్న దర్మవరం కళాకారులు అంకె నాగరాజు. జింకల గంగాధర్‌ను ట్రస్ట్ సభ్యులు సన్మానించారు. వ్యాసగురువులు మండల నాగేంద్ర మదనాపు, కొండన్న, నెట్టెం నాయుడు, ఉమా, వేదపండితులు మంజునాథశర్మలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దర్మవరం నియోజకవర్గ వైసిపి కల్చరల్ వింగ్ అధ్యక్షులు షరాబ్ యోగానంద ఆర్. కళాకారులు ముసలప్ప, గంగాధర, చైతన్యరెడ్డి, సాకే కిరణ్, మిడతల నాగరాజు, అహ్మద్ బాషా పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం


ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ ర్యాలీల సందర్భంగా ప్రజల మధ్య ఎటువంటి ఇబ్బందులు, ఘర్షణలు లేకుండా శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసు సిబ్బంది కృషిని అభినందిస్తు ఎస్‌డిపిఐ నాయకులు డిఎస్పి మహేష్‌ను ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూర్ మహమ్మద్, షేక్ ఇమ్రాన్, అబ్దుల్ హబీబ్, షేక్ మొహమ్మద్ ఉమర్, రియాజ్ భాష, ఇమ్రాన్, వాహిద్, అబ్దుల్ హబీబ్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆసరా అని రాష్ట్ర బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గం కు చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ. 26,53,615 విలువైన చెక్కులను మంత్రి సవిత, ప్రభుత్వ చీఫ్ విప్ వినుకొండ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు, పరిశీలకులు నరసింహారావు, మార్కెఫెడ్ చైర్మన్ బంగారాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు త్వరగతిన పరిష్కరిస్తూ ప్రజలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెక్కుల పంపిణీలో మంత్రి, తదితరులు



ట్రోఫీతో విజేత జట్టు

ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీ విజేత ఎన్పీ కుంట జట్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో టోర్నీ విజేతగా ఎన్ పి కుంట ఉపాధ్యాయుల జట్టు నిలిచింది. గత నెల నుంచి కదిరి ఎస్‌టిఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల మైదానం లో జరుగుతున్న ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీ ఫైనల్లో ధర్మవరం జట్టుపై ఎన్ పి కుంట మండలం జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాలు నుండి 13 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీల్లో మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 68 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన ఎన్‌పి.కుంట జట్టు 11 ఓవర్లలో 2 వికెట్లను కోల్పోయి విజయం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. అనంతరం యస్‌టియు స్పాన్సర్ చేసిన విన్నర్ కప్‌ను ఎన్ పి కుంట జట్టుకు అందించారు. ఈ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ గా సందీప్ ఎంపికయ్యాడు. ఈ ముగింపు కార్యక్రమంలో ఎంఇఒలు గోపాల్ నాయక్ , రమణ, సురేష్ బాబు, సాయి, మెంటర్ గంగాధర్ రెడ్డి, ఎంపీ కుంట జట్టు కెప్టెన్ శ్రీనివాసులు, ఎస్‌టియు హరిప్రసాద్ రెడ్డి, ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి గౌస్ లాజమ్, రుద్రం రెడ్డి, సురేంద్ర, శంకర్ నారాయణ రెడ్డి, ఆజమ్, మనోహర్, లక్ష్మీనారాయణ రెడ్డి, రామమోహన్, శ్రీనివాసులు, లష్కర్ నాయక్, చందు, ఆనంద్ రెడ్డి, నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈటోర్నీ ఆర్గనైజర్లుగా శ్రీనివాసులు, రమణ, ముబారక్ వ్యవహరించారు.

నేరాలు ఘోరాలు

భర్త చేతిలో భార్య హతం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో దారుణం చోటు చేసుకొంది. మద్యం మత్తులో ఓ వ్యక్తి తన భార్యను గొడ్డలితో నరికి చంపాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు... ఎస్సీ కాలనీకి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి మద్యం మత్తులో తన భార్య లక్ష్మీదేవి(35)ని గొడ్డలితో నరికి చంపాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాఘవేంద్రకు అతని భార్య లక్ష్మీదేవికి గొడవ జరిగింది. ఈ నేపథ్యంతో రాఘవేంద్ర ఆవేశంతో గొడ్డలితో భార్యపై దాడి చేశాడు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు గమనించి రక్తం మడుగులో ఉన్న లక్ష్మీదేవిని ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. కాగా హత్య చేసిన రాఘవేంద్ర నేరుగా పోలీసు స్టేషన్కు వెళ్లి లొంగిపోయాడు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా వీరికి ఇంటర్ చదివే కుమార్తె ఉంది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణానికి చెందిన యువకుటు శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన గోసల భార్గవ (25) ఓ మొబైల్ షాపులో పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఐదు సంవత్సరాల కిందట ఓ ప్రమాదంలో కాలు విరిగిపోయిన సమయంలో వైద్యులు రాడ్డుని శస్త్ర చికిత్స ద్వారా కాలులో అమర్చారు. దీంతో వికలాంగుడైన తాను ఏ పని నీ చేయలేకపోతున్నానని మధన పడేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తన ఇంటిపైనున్న గదిలో ఉరివేసుకుని మృతిచెందాడు. మృతుని తండ్రి సాంబశివుడు కూడా ఒక సంవత్సరం కిందట అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ రెడ్డప్ప తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - రొద్దం

మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తహశీల్దార్ ఉదయశంకర్‌రాజ్ ఆదివారం తనికీ ఏశారు. దుకాణదారులు యూరియా ఏమైనా స్టాక్ పెట్టుకున్నారా అనే ఉద్దేశంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రికార్డులు సరిగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీ దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ అసుపత్రి ఆవరణంలో టిడిపి మైనార్టీ యువకులు ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ సేవా స్ఫూర్తితో రెండు నెలల నుంచి అసుపత్రిలో రోగులకు అన్నదానం చేస్తున్న మన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎండిఎస్ ఇందాద్, సీనియర్ నాయకులు బండ్లపల్లి బాబా, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి ఎం డి ఎస్ అమన్, 7వ వార్డు మహబూబ్ బాషా, బండ్లపల్లి హసీబ్, అక్బర్, ఐటిడిపి సాదిక్, యాసిన్, రెహ్మాన్, ఉజేఫా తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా పరిధిలోనేర ప్రవృత్తికి ప్రోత్సహించే రౌడీషీటర్లు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తులు వాటన్నిటికీ స్వస్తి పలకాలని ఎస్పీ వి. రత్న తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాలో నేరనియంత్రణ , శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని,నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో శక్తి టీం బందాల ద్వారా చట్టాలు , డయల్ 100, 112, 1091,1098,181,1930, శక్తి యాప్ సేవలపై మహిళలకు, బాలికలకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ ఫోక్సో, యువ్ టీజింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు.

పోలీసు సేవలు చిరస్మరణీయం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పోలీసు సేవలు చిరస్మరణీయమని ప్రతి ఒక్కరికి ఉద్యోగ విరమణ సహజమని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి రత్న పేర్కొన్నారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు . జిల్లాలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ శ్రీరాములు, మహిళా ఎస్ఐ కళావతి, ఎఎస్ఐలు మస్తాన్, వెంకట్రాముడును ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలవాలతో ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం వివిధ హోదాలలో అంకితభావంతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి సేవలు అందించారని, విధి నిర్వహణలో ఎన్నో సమస్యలు ఎదురైనప్పటికీ ఎక్కడ రాజీ పడకుండా ఉద్యోగ బాధ్యతలు చక్కగా నిర్వర్తించారని ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఏవో సుజాత, సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, ఆర్ఐలు వలి మహేష్, సీసీ చిరంజీవి, కుటుంబ సభ్యులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎస్పీ, తదితరులు

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం : వైసిపి





హిందూపురం, పుట్టపర్తిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

ఖరీఫ్ సీజన్ సగం దాటినా రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడంలో టిడిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని వైసిపి నాయకులు వేణురెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఈ నెల 9న జరగనున్న ఎరువుల బ్లాక్ మార్కెట్ పై "అన్నదాత పోరు" కార్యక్రమ గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణురెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామి రెడ్డి మాట్లాడుతు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు, యువకులు, మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రైతులు పండించే పంటలకు ఎరువులు కూడా అందించలేని దుస్థితిలో పరిపాలన వుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు యూరియా కోసం నిద్రాహారాలు మాని కాపలా కాస్తున్నారని చెప్పారు. యూరియా బస్తా ప్రయివేటు వ్యాపారుల వద్ద రూ.400 నుంచి రూ.500 వరకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడినా ఒక యూరియా బస్తాకు మించి పంపిణీ చేయడం లేదని చెప్పారు. ఎరువుల కొరత లేదని ఒకవైపు జిల్లా అధికారులు చెపుతున్నా వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉందని చెప్పారు. రైతు సేవా కేంద్రం, పిఎసిఎస్‌ల చుట్టూ తిరుగుతున్నా ఒక్క యూరియా బస్తా కూడా అందని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఈనెల 9న పెనుగొండలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరుగు అన్నదాత పోరు కార్యక్రమానికి హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షాజియా, రోషన్ ఆలి, మల్లికార్జున, నాయకులు బాలాజి మనోహర్, సంతేబిదనూరు రాము, దాదు, రామ్మూర్తి, రామకృష్ణ రెడ్డి, అంజినప్ప, శ్రీరామిరెడ్డి, అతావుల్లా, కట్లా భాష తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9 న పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దు కుంట శ్రీధర్ రెడ్డి రైతన్నలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతన్నలను ఆదుకోవటంలో విఫలమైందన్నారు. యూరియా ఎరువులు, విత్తనాలు సరిగా అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో రైతుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని ఎండగట్టడానికి "అన్నదాత పోరు" కార్యక్రమాన్ని వైసిపి చేపట్టిందని, ఈ కార్యక్రమానికి గ్రామ గ్రామం నుండి రైతన్నలు రైతు కూలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు.

గుడిబండ : రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 9న పెనుకొండ ఆర్డీవో కార్యాలయం ఎదుట తలపెట్టిన రైతు పోరుబాట పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ యంజేరగౌడ్ మాట్లాడుతూ వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటానికి చేపట్టిన రైతు పోరుబాట కార్యక్రమానికి నియోజకవర్గంలోని రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.